
# పోతనభాగవతంలో రసగుళికలు

– ఆర్.శర్మ దంతుర్తి



## 94 వ భాగం

### బ్రహ్మతో నారదుడి సంభాషణ – భగవద్విభూతి

భాగవతం వినడానికి పరీక్షిత్తు మనసులో అన్నీ, అందర్నీ సన్యసించి సిద్ధమయ్యాడు కదా, ఇప్పుడు కథ ప్రారంభించే ముందు ఏమి చేస్తే మంచిదో చెప్తున్నాడు శుకమహర్షి. దీనర్థం ఏమిటంటే 'నేను' అనేది వదులుకోవాలి. ఎంత మంచి పని చేసినా 'నేను చేసాను/చేస్తున్నాను' అనే అహంకారం వదిలించుకోవాలి.

చ. తపములఁ జేసియైన, మఱి దానము లెన్నియుఁ జేసియైన, నే
జపములఁ జేసియైన, ఫలసంచయ మెవ్వనిఁ జేర్పకున్న హే
యపదములై దురంతవిపదంచితరీతిగ నొప్పుచుండు; న
య్యపరిమితున్ భజించెద నఘౌఘనివర్తను భద్రకీర్తనున్. [2-62]

తపస్సు చేసినా జపం చేసినా, దానాలు ఎన్ని చేసినా సరే ఆ ఫలం భగవంతుడి అర్పించకపోతే నిష్ఫలం అవుతుంది. అంటే ఈ కథ నా చేత చెప్పించడం, ఆ చెప్పడం వల్ల వచ్చే ఫలితం కూడా ఆయనదే సుమా అని నిఘూఢంగా చెప్తున్నాడు. ఇదే భగవద్గీతలో చెప్పిన కర్మఫల త్యాగం అనేది. దీన్నే రామకృష్ణులు మరింత సులభంగా చెప్తున్నారు చూడండి. "ఒకచేత్తో భగవంతుణ్ణి గట్టిగా పట్టుకుని రెండో చేత్తో నీ పనులన్నీ చేస్తూ ఉండు. ఎప్పుడైతే నువ్వు పని పూర్తి చేసావో, అప్పుడు రెండుచేతులూ ఆయనకే జోడించు." కర్మ చేయడం ఎవరికీ తప్పదు కనక ఇదే సులభమైన పద్ధతి.

క. శ్రీపతియు, యజ్ఞపతియుఁ, బ్ర
జాపతియున్, బుద్ధిపతియు, జగదధిపతియున్,

భూపతియు, యాదవశ్రే
ణీపతియున్, గతియునైన నిపుణు భజింతున్. [2-65]

లక్ష్మీ వల్లభుడు, యజ్ఞానికి అధిపతి, ప్రజలని పుట్టించే ప్రజాపతి, మనకి కలిగే బుద్ధికి, ఈ జగత్తు అంతటికీ (జగదధిపతి), అందరికీ కూడా పతీ, గతీ అయినవాడు శ్రీహరి. ఇంతా చేస్తే ఆయన ఎవరు? ఎలా ఉంటాడు? ఆయన్ని కనుక్కోవడం ఎలా? గుణాలతో ఉన్నాడని కొంతమందీ, నిర్గుణ బ్రహ్మం అని కొంతమందీ అంటున్నారు కదా, ఎలా తెలుసుకోవడం సులభం? ఆ విషయం కూడా చెప్పబోతున్నాడు. ఈ పద్యం లో పోతన 'పతి' అనే పదంతో రకరకాలుగా ఎలా ఆడుకున్నాడో గమనించారా? చివరిపాదంలో పతి అనేదాన్ని కొంచెం మార్చి వీళ్ళందరికీ గతి కూడా భగవంతుడే అని ఎంత లాఘవంగా చెప్పాడో, గమనించండి.

మ. అణువో? గాక కడున్ మహావిభవుఁడో? యచ్ఛిన్నుఁడో? ఛిన్నుఁడో?
గుణియో? నిర్గుణుఁడో? యటంచు విబుధుల్ గుంఠీభవత్తత్త్వమా
ర్గణులై యే విభుపాదపద్మ భజనోత్కర్షంబులం దత్త్వ వీ
క్షణముం జేసెద; రట్టి విష్ణుఁ, బరమున్, సర్వాత్ము సేవించెదన్. [2-66]

సరే, ఇప్పుడా శ్రీహరి, భగవంతుడు ఎవరు? విచ్ఛిన్నం కాని అణువా? లేకపోతే విశ్వమంతా వ్యాపించి ఉన్న సర్వేశ్వరుడా? త్రిగుణాలతో ఉన్నవాడా? లేకపోతే వీటికి అతీతుడైన గుణం లేనివాడా (నిర్గుణుడో)? ఇలా అనుకుంటూ ఏమీ తేల్చుకోలేక చివరకి భగవంతుడి పాదాలని నమ్ముకుని ఆయన తత్త్వ స్వరూపాన్ని గుర్తిస్తున్నారో అటువంటి సర్వాత్ముణ్ణి తలుచుకుంటున్నాను అంటున్నాడు శుకుడు. ఈ పద్యం బట్టి చూస్తే మనకి తెలిసేదేమంటే – ఎన్ని వాదనలు, ఎంత అన్వేషణ చేసినా భగవంతుడనేవాడు ఇలా ఉంటాడు అని తెలుసుకోవడం అసంభవం. అటువంటివన్నీ చేశాక ఏమిటి మనకి తెలిసేది? 'మనకేమీ తెలియదు' అనేది మాత్రమే. అందువల్ల భగవంతుణ్ణి చేరడానికేమిటి మార్గం? శరణాగతి – ఇదే 'భగవంతుడి పాదాలని నమ్ముకుని ఆయన తత్త్వ స్వరూపాన్ని గుర్తించడం' అంటే.

మ. అవిరోధంబున నీవు నన్నడుగు నీ యర్థంబు మున్ బ్రహ్మ మా
ధవుచేతన్ విని నారదుం డడిగినం దథ్యంబుగాఁ జెప్పె; మా
నవలోకేశ్వర! నారదుండు వెనుకన్ నాకుం బ్రసాదించె; సం

శ్రవణీయంబు, మహాద్భుతంబు వినుమా, సందేహవిచ్ఛేదివై. [2-71]

నువ్వు అడిగిన ప్రశ్నే నారదుడు బ్రహ్మ ని అడిగాడు – అవ్యక్తుడైన భగవంతుడు ఈ ప్రపంచాన్ని ఇలా పుట్టించి లయం చేయడానికీ, వివిధమైన వారిని తలో పనీ చేయడానికీ నియమించడానికి ఏమిటి కారణం? అలాచేస్తే ఆయనకి ఏమిటి లాభనష్టాలు అంటూ. అది బ్రహ్మకి మాత్రం ఎలా తెల్సిందంటావో అని చెప్తున్నాను. ఆదిలో సృష్టి ఎలా చేయాలో తెలియనపుడు బ్రహ్మ చేసిన తపస్సు ఫలించాక ఆయన భగవంతుడి నోట విన్నదే ఆ విషయం. దాని ప్రకారం నారదుడు అడుగుతున్నాడు బ్రహ్మని ఈ విషయం.

మ. చతురాస్యుండవు; వేల్పు బెద్దవు; జగత్సర్గానుసంధాయి; వీ
శ్రుతిసంఘాతము నీ ముఖాంబుజములన్ శోభిల్లు శబ్దార్థ సం
యుతమై, సర్వము నీకరామలకమై యుండుంగదా; భారతీ
సతి యిల్లాలఁట నీకు; నో జనక నా సందేహముం బాపవే. [2-73]

నువ్వు నాలుగుముఖాలు కలవాడివి (దీనిని నాలుగు దిక్కులలో జరిగేది తెలుసుకునే వాడు అనుకోవచ్చు), దేవతలకి (వేల్పులకి) పెద్దవాడివి. వేదాలన్నీ (శృతులు) నీ నాలుగు మోహాలలో శోభిల్లుతూ ఉంటాయి. వీటి శబ్దార్థాలు, సర్వమూ కూడా నీకు అరచేతిలో ఉసిరిపండులాగా (కర+అమలకమై) ఉన్నాయి. దీనికితోడు సరస్వతి నీకు ఇల్లాలు. అందువల్ల నా సందేహం తీర్చడానికి నువ్వే సమర్థుడివి. వేదం సంగతి ఎందుకు పెట్టాడు ఈ పద్యంలో? వేదాలలో చెప్పిన నిర్గుణుడు, భగవంతుడూ ఒకరే కాబట్టి, ఆ వేదాలు చేత్తో పట్టుకుని బ్రహ్మ 'నేను కాదు' ఈ పని చేసేది అంతా ఈ వేదాలు నాకు ఇచ్చిన భగవంతుడే అంటూ సృష్టి చేయడం మొదలుపెట్టాడు కాబట్టి. ఈ విషయం భగవంతుడు దక్షుడికి కనిపించినప్పుడు చెప్పడంలో కూడా చూసాం ముందు వ్యాసాల్లో (నిగమంబు మత్స్వరూపంబు – వేదమే నా స్వరూపం). అదలా ఉంచితే శాస్త్రాలన్నింటికీ మూలమైన సరస్వతి కూడా బ్రహ్మకి భార్య కనక ఆయనకి తెలియనిది ఉండడం అసంభవం కదా? అందువల్ల నా సందేహం తీర్చడానికి నువ్వే సమర్థుడివి అంటూ నారదుడు అడుగుతున్నాడు.

శా. ప్రారంభాది వివేక మెవ్వఁ డొసగుం? బ్రారంభ సంపత్తి కా
ధారం బెయ్యది? యేమి హేతువు? యదర్థం బే స్వరూపంబు? సం
సారానుక్రమ మూర్ణనాభి పగిదిన్ సాగింతు వెల్లప్పుడుం
భారం బెన్నఁడు లేదు; నీ మనువు దుష్ప్రాపంబు వాణీశ్వరా! [2-74]

ఈ జగత్తుని సృష్టించే వివేకం నీకు ఎవరిస్తున్నారు? దీనికి ఆధారం ఏమిటి, కారణం ఏమిటి? హేతువు అలా ఉంచితే దీనికి సృష్టికి అర్థం/ప్రయోజనం ఏమిటి? ఈ సంసారాన్ని పుట్టించడానికి సాలెపురుగులాగా (ఊర్ణనాభి), ఇదో తలకెత్తుతున్న బరువు అనుకోకుండా, అవిశ్రాంతంగా శ్రమిస్తున్నా నీకు అసలు శ్రమ అనేది పడుతున్నట్టు లేదు. ఇదంతా వింతగా ఉంది కదా?

శా. నాకుం జూడఁగ నీవు రాజ వనుచున్నాఁడన్ యథార్థస్థితిన్
నీకంటెన్ ఘనుఁ డొక్క రాజు గలఁడో? నీ వంతకున్ రాజవో?
నీకే లాభము రాఁదలంచి జగముల్ నిర్మించె? దీ చేతనా
నీకం బెందు జనించు నుండు నడఁగున్? నిక్కంబు భాషింపుమా. [2-75]

నాకు కనిపించే నువ్వే ఈ విశ్వానికి రాజువి అనుకుంటున్నాను యదార్థంగా. అయితే వాస్తవంగా నీకో ప్రభువు ఉన్నాడంటావా? ఉంటే ఆయన ఎక్కడున్నాడు? నీకేమిటి ఈ విశ్వాన్ని నిర్మించడం, లయం చేయడం వల్ల లాభం? ఈ జీవం అంతా ఎక్కడ పుట్టి ఎక్కడ లయం అవుతోంది? నిజం చెప్పు.

శా. అంభోజాసన! నీకు నీశుఁడు గలం డంటేనిఁ; దత్పక్షమం
దంభోజాతభవాండ మే విభుని లీలాపాంగ సంయుక్తి చే
సంభూతం; బగు వర్తమాన మగు; సంఛన్నం బగుం; దద్విభున్
సంభాషింపఁగ వచ్చునేఁ? దలఁప నే చందంబువాఁ డాకృతిన్? [2-77]

వ. దేవా భూతభవిష్యద్వర్తమానంబు లగు వ్యవహారంబులకు నీవ వల్లభుండవు; నీ యెఱుంగని యర్థం బొండెద్దియు లేదు; విశ్వప్రకారంబు వినిపింపు" మనిన విని వికసితముఖుండై విరించి యిట్లనియె [2-79]

నీకే కనక ఒక ప్రభువు ఉన్నాడంటే ఆయన ఎలా ఉంటాడు? ఈ బ్రహ్మాండం ఏ విభుడి లీలాపాంగ సంయుక్తి చేత పుట్టి, ప్రభవించి, లయం అవుతోంది? ఆ విభుడి గురించి తెలుసుకోవచ్చా? ఆయన స్వరూపం ఎటువంటిది? భూత భవిష్యత్తులనీ, వర్తమానాలన్నీ తెలిసినవాడవు; నీకు తెలియని విషయం ఉండబోదు కదా. అందువల్ల నేను అడిగిన ఈ విశ్వం ప్రకారం ఎలా ఉందో చెప్పు. ఇలా అడిగేసరికి నవ్వుతూ బ్రహ్మ (విరించి) నారదుడికి సమాధానం చెప్తున్నాడు.

క. రారా బుధులు; విరక్తులు
గారా; యీ రీతి నడుగఁగా నేరరు; వి
స్మేరావహము భవన్మత
మౌరా! నా విభుని మర్మమడిగితి వత్సా! [2-80]

నా దగ్గిరకి ఎంతో మంది విజ్ఞులు (బుధులు), విరక్తులు (వైరాగ్యం ఉన్నవారు) వస్తూ ఉంటారు కానీ ఎవరూ కూడా ఈ విధంగా భగవంతుణ్ణి గురించి అడిగినవారు లేరు. నాకే విభుడైన భగవంతుడి గురించి అడిగావు.

శా. నానా స్థావరజంగమప్రకరముల్ నా యంత నిర్మింప వి
జ్ఞానం బేమియు లేక తొట్రుపడ నిచ్చున్ నాకు సర్వానుసం
ధానారంభ విచక్షణత్వము మహోదారంబు గా నిచ్చె ము
న్నే నా యీశ్వరు నాజ్ఞఁ గాక జగముల్ నిర్మింప శక్తుండనే? [2-81]

చరాచర ప్రపంచాన్ని నిర్మించడానికి నాకు జ్ఞానం ఏమీ లేనప్పుడు, ఏమి చేయాలో తొట్రుపడుతూంటే సృష్టి ప్రారంభించడానికి కావాల్సిన విచక్షణని మాహా ఉదారంగా ఇచ్చాడు భగవంతుడు. అది గానీ లేకపోతే ఈ జగాలన్నింటినీ నిర్మించే శక్తి నాకెక్కడిది? విషయం గమనించారా? బ్రహ్మతో సహా ఎవరూ కూడా ఈ పని 'నేను' చేస్తున్నాను అనుకోవడం లేదు. అదే అహంకారం పోవడం అంటే. చేసేదీ చేయించేదీ అన్నీ భగవంతుడే. 'నేను' అనేదే లేదు. ఇదే మొదట్లో చెప్పిన "హరి మయము విశ్వమంతయు, హరి విశ్వమయుండు ..." అనే విషయం.

మ. వినుమీ; యీశ్వరు దృష్టిమార్గమున నావేశింప శంకించి సి
గ్గున సంకోచము నొందు మాయవలనం గుంఠీభవత్ప్రజ్ఞచే
నను లోకేశ్వరుఁ డంచు మ్రొక్కు మతిహీనవ్రాతముం జూచి నే
ననిశంబున్ నగి ధిక్కరింతు హరిమాయాకృత్య మంచున్ సుతా! [2-83]

ఈశ్వరుడి పథంలో ప్రవేశించడానికి 'మాయ' అనేది సిగ్గుతో కుచించుకుపోతుంది. కానీ ఈ మాయలో పడిన, జనం నన్నే లోకేశ్వరుడనుకుంటూ మూర్ఖంగా (మతిహీనవ్రాతమన్) మొక్కుతూ ఉంటారు. వీళ్ళని చూసి ఇదంతా ఆ భగవంతుడి లీలే కదా అని నేను నవ్వుకుంటూ ఉంటాను.

తనని కోరికల కోసం మొక్కడం అనే విషయం ఉపోద్ఘాతంగా చెప్తున్నాడు బ్రహ్మ నారదుడితో; ఎందుకంటే ముందు చెప్పబోయే కథల్లో హిరణ్యాక్ష, హిరణ్యకశిపులు తనకోసం తపస్సుచేసి వరాలు పొందడం, ఆ వరాల వల్లే చావు కొని తెచ్చుకోవడం అవీ చెప్పడానికి. వచ్చే వ్యాసంలో సృష్టి క్రమం ఎలా జరుగుతుందో చెప్పడం చూద్దాం.

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS